# మౌనసుందరి

గాలి ఏడుస్తోంది.

చుక్కలు నక్కల గరువుమీద కునుకు దీపాల్లా ఉన్నాయి. చంద్రుడు పాండురోగి ముఖంలా ప్రకాశిస్తున్నాడు.

ఆకాశం - హఠాత్తుగా తన ముఖానికింత చీకటి పులుముకొని మా వూరుమీద ఇంత పులిమింది.

కంట్లో తడిమేఘాలు...

మబ్బు పాయవిచ్చినప్పుడు... నీరసంగా వచ్చే వెన్నెల క్షయరోగస్త్రీ విధిలేక నవ్విన నవ్వులా వుంది.

గుండెల్లో బాధ అణుచుకుంటూ... జాజిపందిరి దగ్గరికి వచ్చాను.

అదృష్టం... కొరివిదయ్యంలా... ఎంత దాగుడుమూతలాడినా... సన్నజాజిపూవాసన తగలగానే ప్రాణం చుర్రుమనడం ఇంకా మానలేదు.

జాజి వాసన ఒక ప్రియురాలిని జ్ఞప్తికి తెస్తుంది.

ఆ కోరిక వెచ్చదనంతో బ్రదుకంతా... సజీవంగా నిండుగా గడుపుదామనుకున్నాను.

చట్టున...

బ్రతుకులో వేడి పోతూన్నదేమో అని తోచి మనస్సు ఏడిచింది.

జాజిపూలు వెక్కిరించాయి.

పువ్వుల అందం తెగ పొగుడుతారు కవిగాళ్లు... వాళ్లకొక ఆస్పత్రి కట్టించడం మంచిది.

నే చెబుతున్నాను విను.

జాజిపూలకన్న సన్నంగా కత్తిరించిన కాగితం ముక్కలు దొడ్డవి.

వాసనారహితం కావడం గొప్ప స్థితి అంటారు వేత్తలు...

తలవంచుకు నడుస్తున్నాను.

నీలిమంధులాంటి అవమానంలో...

నిలువునా ముంచి పైకెత్తినట్టుంది.

ఒక్కొక్కనాడు ఒక్కొక్క మనిషిమీద లోకం పగబడుతుంది కాబోలు -

ఈవేళ నావంతు...

శాకుంతలం నాటకం మీదా... శరచ్ఛాత్రులమీదా, ఆ అమ్మాయి ముఖంమీదా యిముడ్చుకోలేనంత రోతగా వుంది.

ప్రేమ అనే మాట దేవతావస్త్రం లాంటిది గాబోలు! ప్రతివాడూ మహామహోపాధ్యాయుడులా మాటలాడుతాడు.

స్వరూపం చూచినవాడు ఒక్కడూ లేడు... అంతకంటే వెళ్లే త్రాణలేదు.

మానవుడు సుఖమైన కాలక్షేపానికి... మెదడులో కల్పించుకున్న జాడ్యం కాబోలు ఈ ప్రేమ!

ఇంద్రియ ఉన్మాదానికి ఎంత చక్కని పేరు! పేరు రావడానికి ప్రజ్ఞ వుండడం కారణం... అనుకోవడం, మాటకు అర్థం ఉండాలనేటంత చాదస్తమోయ్ అన్నాడు నేస్తం.

వర్షం కురిసింది గాబోలు... రోడ్డు తడి కాలుజారేదాకా తెలియలేదు... తాగి నడుస్తున్నాడని నిర్ణయించారు. కారణాలూహించడంలో కాలం ఏమీ వృథాచెయ్యని బుద్ధిమంతురాలు ఈ లోకం. తలలోతులలో తుఫాను... అని రూఢిగా రేడియోలాంటిది... అరిచింది. తూలి...

ఎదురుగా వచ్చే ఒక పెద్దమనిషి మీద... పడ్డాను.

పెద్దమనిషి ఒక్కటి లాగి చెంపను కొలచూడడానికి బదులుగా...

"అన్నా... ఇంటికి వెడదాంరా!" అన్నాడు.

వెంకటేశ్వర్లు!!

•••

వెంకటేశ్వర్లు ఎందుకు నాకు తమ్ముడో అర్థం కాలేదు.

నాకంటే మంచి ఆస్తి, ఆరోగ్యం, తకంటే మంచి పలుకుబడీ గలవాడు.

అతడు నన్ను చూస్తే ఇష్టపడడంకంటే ద్వేషించడానికే ఎక్కువ కారణాలున్నాయి.

ఒకసారి అతడు స్నేహితుడితో... కలలు నిజమనీ, భగవద్భక్తి అత్యవసరమనీ ఆవే

శంగా ఉపన్యసిస్తూ వుంటే దురదృష్టవశాత్తూ నేనక్కడ తటస్థపడి నా ఆధునిక పరిజ్ఞానంతో అతన్ని తలకిందులు చేశాను.

దేవుడి మహత్తు పూజారి బుద్ధివిశేషం మీద ఆధారపడి వుందండీ అని నేననగానే... నన్ను త్రాచుపామంత క్రూరంగా చూచి చట్టున అక్కడినుంచి వెళ్ళిపోయాడు వెంకటేశ్వర్లు.

తర్వాత ఎన్నోచోట్ల కలుసుకున్నాం. కాని వెంకటేశ్వర్లు నాతో మాట్లాడలేదు.

నా మాటలు శ్రద్ధగా వినేవాడు.

మాకు తెలియకుండానే నా చురుకుతనం మీద అతనికీ, అతని నిజాయితీ మీద నాకూ ఒక చిత్రమైన ఆకర్షణ పుట్టిందేమో చెప్పలేను.

నాటికి నేడు తలవని తలంపుగా ఎదుట... వెంకటేశ్వర్లు!

"వికారంగా వుందా? కాస్తసేపు మా యింటివద్ద విశ్రమించి వెళ్ళుదువుగాని..."

ఆ ఏకవచనం అతణ్ణి నాకు మరీ సన్నిహితుణ్ణి చేసి మనస్సుకు సుఖంగా తగిలింది.

భుజంమీద చెయ్యివేసి నడిపిస్తున్నాడు.

ఎంత దయగా... జాలిగా... ఇష్టంగా.

వెంకటేశ్వర్లు మనిషికాదు... దేవుడేమో అనిపించింది.

'మళ్ళా అతన్ని చూడగానే తగాదా దేవుడు జ్ఞాపకం వచ్చాడా?'

ఆ బాధలోనే దుర్బలంగా నవ్వాను.

వెంకటేశ్వర్లు స్పర్శతో ఈ దేవుడు కూడా నాకు సంక్రమించాడా?

అతని ఔదార్యానికి ఏదో గొప్పపేరు పెట్టాలని చప్పున ఏమీ దొరక్క దేవుడన్నాను. అంతేగాని ఆధునిక తర్కవిద్యలో ఆరితేరిన నేను చూస్తూ, దేవుణ్ణి ఎట్లా వప్పుకోను?

"చల్లని నీళ్లతో పాదాలు, ముఖం కడుక్కుంటే బాధ కొంత తగ్గుతుంది" అన్న వెంకటేశ్వర్లు మాటతో నా ఆలోచన ఆగి... తలయెత్తి చూశాను.

చక్కని మేడ.. ముందు పూలతోట. హాల్లో మెత్తని సోఫామీద చతికిలబడ్డాను.

మనస్సు కొంచెం తేరుకుంటోంది.

ఒక్క నిమిషం స్తిమితపడి... వెంకటేశ్వర్లుకు నా కృతజ్ఞత వెల్లడించి వెళ్ళిపోవలెనను కుని కన్ను మూసుకున్నాను.

రెండు నిమిషాలు నిశ్శబ్దం...

పక్కను ఉన్న టీపాయ్ దగ్గర బంగారు గాజుల చప్పుడు విని ఉలికిపడి కళ్ళు తెరిచాను.

ఊదా గాజుగ్లాసులో పళ్ళరసం తెచ్చిపెట్టి ఆమె అంది.

"ఈ రసం పుచ్చుకోండి అన్నయ్యగారూ! మేము పరాయివాళ్లం కాము. మోమాట పడకండి. ఆయన రోజూ చెపుతూంటారు మిమ్మల్ని గురించి..."

ఆమె ముఖంలోంచి ఎవరో ఋషిపత్నులు తొంగి చూస్తున్నారు,

ఆమె వర్షాశుభ్రస్నాత పారిజాత పుష్పంలా వుంది తెల్లచీర కట్టుకుని.

నలిగిపోయిన పురుషుల్ని ఓదార్చడానికి, సేద దీర్చడానికి ఎన్ని యుగాలనుంచి భగవంతుడు స్త్రీ హృదయం అనుగ్రహించాడో గదా -

నౌకర్లు లేరా? ఈశ్రమ ఈమెకు కల్పించాడెందుకో వెంకటేశ్వర్లు.

పురుషుడి మిధ్యా పౌరుషం, అహంకారం, తెచ్చిపెట్టుకున్న కరుకుతనం - అన్నీ స్త్రీ సన్నిధానంలో మంచులా కరిగి ద్రవించిపోతాయి గాబోలు!

ఏదో అనబోయినాను గాని మాట పెగిలిరాలేదు. మంత్రదండం దగ్గర నాగులా తల ఒంచుకొని పండ్లరసం తాగాను.

ఆమె వెళ్లిపోయింది.

చెడిన యంత్రాలను బాగుచేసి యంత్రజ్ఞుడు వెళ్ళిపోయినట్టుంది.

నాలో చెడిన యంత్రాలు తేరుకుని తిరగడం ప్రారంభించాయి.

లేచి నుంచున్నాను.

వెంకటేశ్వర్లు వచ్చాడు.

వెళ్ళుతున్నానని చెప్పబోతూ కృతజ్ఞతగా చేతులు జోడించాను. వెంకటేశ్వర్లు తప్పు బట్టి కౌగలించుకుని మళ్ళా కూర్చోబెట్టాడు.

మేడమీద పరుపు పరచి పక్క సిద్ధం చేశానని నౌకరు చెప్పాడు.

వెంకటేశ్వర్లు వెళ్ళనివ్వలేదు.

• • •

నాతో మేడమీదకు వచ్చి దక్షిణంవైపు ఒక గది చూపి అక్కడ విశ్రమించమని చెప్పి వెడుతూ.. ఏమి కావలసినా అడగమని స్నేహమయంగా అని దిగివెళ్ళాడు ఆ నిష్కారణ బంధువు.

"ఔను. నీకేం కావాలి?"

అన్న ప్రశ్న శతాబ్దాల నుంచి కొండ శిఖరాలకు మధ్య లోయలో ప్రతిధ్వనిలా నా మనస్సు ఏ మూలనో ఖంగుమని మారుమోగి చల్లచల్లగా కరిగిపోయింది.

గదిలోకి వెళ్ళాను. విశాలంగా నిగనిగలాడే తెల్లని గోడలతో పరిశుభ్రంగా వుంది. ఉత్తమ స్నేహితుడి హృదయంలా తెరిచిన పెద్ద కిటికీనుంచి చల్లగాలి వస్తూన్నది.

మధ్యగా ఒక చిన్న బల్లమీద గాజు కూజాలో రెండు సంపంగి పూల గుత్తులూ, గులాబీలూ పరిమళిస్తున్నాయి.

దక్షిణోత్తరంగా ఒక పట్టెమంచం మీద పాలమీగడ వంటి పరుపు, రెండు తెల్లని దిండ్లూ అమర్చి వున్నాయి.

మంచానికి దగ్గరగా ఒక బల్లమీద పళ్లెంలో రెండు ద్రాక్షగుత్తులూ, నారింజలూ, స్వచ్ఛమైన గాజు గిండిలో మంచినీళ్ళూ వున్నాయి.

ఒక్కొక్క అవ్యాజకరుణ. నిష్కారణ అనురాగం మనిషిని ద్వేషంకన్న ఎక్కువ చిక్కుపెడ తాయేమో అనుకున్నాను.

ఒక ద్రాక్ష తుంచి నోట్లో వేసుకుని.. మంచంమీద కూచుని.. కిటికీలోనుంచి దూరం గా కనబడే ఉదారంగు ఆకాశం, ఎత్తుగా పెరిగి గాలికి కదిలే ఏవేవో చెట్లూ... ఇంటి కప్పులూ, గుడి గోపురాలూ... చర్చి శిఖరాలూ.. శూన్యంగా చూస్తున్నాను.

ఊరంతా అలసి ఎవరి ఒడిలోనో ఒడలు మరిచి నిద్రపోతూన్నట్టుంది.

బాహ్యప్రపంచంలో కనపడే విభిన్న నిర్మాణాలూ - విచిత్ర దృశ్యాలూ - వేరువేరు రంగులూ - జాతులూ - మతాలూ - ఇంతింతగా మానవుణ్ణి పిలిచి ప్రశ్నిస్తూ వుంటే...

లోపలి మనఃప్రపంచంలో.. ఎన్నెన్ని ఇంద్రధనుస్సులూ, ఇంద్రజాలాలు, అగాథ పాతాళాలూ, అనంత స్వర్గాలూ క్రిక్కిరిసి ఈ మహా విశ్వరథాన్ని నడుపుతున్నాయో ఎవడె రుగును?

ఆవలింతలు ఒస్తున్నాయి.

మెత్తని దిండ్లమీద తలవాల్చి కళ్ళు మూసుకున్నాను. నిద్రమాత్రం రాదు.

కోరినంతసేపు మనిషికి ఏది కలిసివచ్చింది? నిద్ర రావడానికి -

శుష్క హృదయులకు రంభలూ, ఊర్వశులూ రసమయ జీవులకు జీబ్రాలు - ఉష్ట్ర పక్షులూ -

ఛా - ఏమి లోకయాత్ర ఇది?

ఈ ప్రపంచం ఒకప్పుడు సలక్షణంగా నడిచి నడిచి తర్వాత అతివేగంతో ఎక్కడో పట్టుతప్పి తలకిందుగా తిరుగుతున్నదేమో అనిపిస్తుంది నాకు.

లేకపోతే - ఇందరు మహాత్ములు, ప్రవక్తలు, కవులు, ఋషులు దీన్ని సరిగ్గా తిప్ప డానికి ఇంత ప్రయత్నం చెయ్యడం ఎందుకు?

ఎడారిలో ఇసక తుఫానులా నా తలలో చెలరేగిన కోటి ఆలోచనాగ్నులు –

... తలపోటు మరచిపోవడానికి ఇటు అటు తిరగవలెనని లేచి ఏం తోచక ఊరికే గది నాలుగుమూలలా చూస్తున్నాను.

హఠాత్తుగా గదిలో ఒక మూల ఏదో ఉన్నట్టు తోచింది.

కుతూహలం కొద్దీ లైటు వేసి చూశాను. కళ్లు ఆశ్చర్యంతో ... నిశ్చేష్టమయి పోయాయి. గది గోడల మీద ఏవిధమైన బొమ్మలూ, చిత్రపటాలూ లేవుగాని – గదికి తూర్పువైపున మూలగా చక్కని నగిషీ పనిచేసిన ఇరుగుడు చేవబల్లమీద ఒక లోకాతీత సుందర శిల్పం వుంది.

స్వచ్ఛమైన చలవరాతితో దక్షిణదేశ శిల్ప పద్ధతిలో మలచిన సుందర స్త్రీమూర్తి అది. ఒక అభినయ ముద్రలో ఎత్తిపట్టిన చేతులు... వేళ్లు, సోగగా కర్పూరశలాకల వలె మెరుస్తున్నాయి.

తీర్చిదిద్దిన నున్నని కపోలాలూ చిబుకమూ నాసికల మీద పడి దీపకాంతి జారిపోతున్నది.

సుకుమారోన్నతంగా కనబడే వక్షస్థలంనుంచి బయలుదేరి నెమ్మదిగా నడుంమీదకు సాగి, నాజూకుగా అక్కడ సన్నగిల్లి క్రమంగా జఘనభాగం మీద బలిసి, సౌందర్య సర్వస్వాన్ని అక్కడ సుడులు తిప్పి, ఊరువుల మీదుగా పాదాలకు దిగజారిన ఆమె శరీర లావణ్యరేఖ దీపశిఖలా వెలిగి వెలిగి నా హృదయాన్ని అంటించింది.

పొరపాటున ఎగసిన నిప్పురవ్వతో బాణసంచా బండి ఒక్కసారిగా భగ్గుమని అంటుకుంది.

జన్మజన్మాంతరాలుగా మనస్సు అట్టడుగున దాగివున్న రంగుల జ్వాలలూ... భయంకర శబ్దాలూ.. దుర్మార్గపు మంటలూ ఉవ్వెత్తుగా పైకెగిరి పేలి దహించడం ప్రారంభించాయి.

స్త్రీ సౌందర్యం, మధురమూ ఆస్వాద్యమూ కాక ఇంత దారుణమైనదని అంతవరకూ అనుకోలేదు.

ఒక వాలుజడ, రంగుచీరా కనపడగానే బయలుదేరే చాలా దగ్గులకు, దరహాసాలకు, దానధర్మాలకు, అధికప్రసంగాలకు, గొంతుకులో గాలం గుచ్చుకున్న చేపల్లా గిలగిలలాడే చాలా చూపులకూ, వెనక్కాల ఇంతటి క్షోభా జరుగుతున్నది కాబోలు పాపం!

ఇంతటి సౌందర్య మూర్తి లోకంలో సులభమా? నిర్దుష్టమైన ఆ అవయవ సౌష్ఠవం జీవిత యాత్రలో ఎక్కడా చూచిన జ్ఞాపకం లేదు.

కాళిదాసు ఊర్వశీ, భవభూతి మాలతీ, అజంతా శిల్పి అమరరేఖా కల్పనా.. అన్నీ ఎక్కడో కలిసి ఈ విగ్రహంలోకి ప్రవహించినవేమో -

పాపం, ఈ శిల్పి తన సౌందర్యకాంక్షకు పరమావధిగా... బ్రతుకంతా ఈ బొమ్మను సృష్టించి పూర్తికాగానే వెళ్ళిపోయాడేమో -

వెంకటేశ్వర్లు ఇంతటి సౌందర్యాభిరుచి కలవాడని అంతవరకూ అనుకోలేదు. ఎక్కడ సంపాదించాడో ఈ విగ్రహం?

మంచంమీద ఒరిగి ఆలోచిస్తున్నాను. చిన్నతనం నుంచీ ఖండఖండాలుగా తెగి అతుక్కుంటూన్న చిత్రమైన జ్ఞాపకాలతో మనస్సు నిండిపోయింది.

కాలవగట్లు... సంపంగి చెట్లూ.. పేర్లు మరచిపోయిన ఆడపిల్లల ముఖాలూ... జ్ఞాతాజ్ఞాతంగా అప్పుడు కలిగిన వెచ్చని కోరికలూ...

ఎందుకో... అవన్నీ ఇప్పుడు...

నిద్ర వస్తున్నది. కోరినప్పుడు రాలేదు.

నా రంగు ఆలోచనల్ని పేకముక్కల్లా కలిపివేస్తూ ... నిద్ర కనురెప్పలమీద...

• • •

ఉలికిపడి లేచాను. మెత్తని సుకుమార హస్తం ఏదో నా శరీరాన్ని నిమురుతూన్నది.

ఎంత ఒత్తిగించినా, కనురెప్ప లెగయడం లేదు. కష్టపడి తెరిచాను.

ఒక అప్సరఃసుందరి నా మంచం పక్కని నించుని వుంది.

తల అంటుకున్న మెత్తని జుట్టు పొడిపొడిగా కొంత నుదురుమీదకు చెదిరి చెవులను కప్పుతూ, వెనక్కు జడగా సాగింది. అక్కడ బరువుగా పక్కకు ఒరిగే జాజిపూల దండ.

ముఖం... మెడవంపు... చేతులూ... మంచిగంధపు రంగుతో మెరుస్తున్నాయి.

నేనింతకుముందు చూచిన శిల్ప స్త్రీమూర్తి సుకుమార వక్షంలో జల్లున నెత్తురు పొడిచి నట్టయింది. అవే పెదవులూ.. అదే చిబుకమూ, సజీవంగా చిరునవ్వుతో కదులుతున్నాయి.

చట్టున బొమ్మ వున్నవైపు చూచాను.

బల్ల ఖాళీగా వుంది.

నా శరీరం నిలువునా ఝల్లుమంది.

కథల్లోలాగా ఏమిటీ విచిత్ర సంఘటన!

నమ్మలేక రెండుసార్లు కళ్ళు తుడుచుకున్నాను.

ఆమె మరీ 'సెలవివార' నవ్వింది. వరూధిని కాదుగదా -

నాలో కవిత పుడుతున్నది గాబోలు -

ఎంత చచ్చుపురుషుడైనా సుందరస్త్రీ సమీపిస్తే చాలు కవిత్వం తీస్తాడు.

ఇక కళల స్పర్శ గలవాడు పుంజాలు తెంచుకుంటాడు.

"నువ్వు వరూధినివా?"

మాట్లాడకుండా మళ్లా విరగబడి నవ్వుతూ మంచంమీద తగులుతూ కూర్చుంది.

"అమ్మాయీ, నీ భాష నవ్వా?"

ఇప్పుడు నవ్వలేదు.

"నీ సంభాషణ మౌనమా?"

మళ్ళా నవ్వింది.

ఈలోకం పిల్ల కాదేమో -

రాత్రి వెన్నెల వీధుల్లో దారితప్పి మబ్బు మెట్లమీద కాలుజారి భూమిమీద పడ్డదా?

ఆమె కొంచెం తలవంచి పైరెప్పల మీదనుంచి కనుబొమ్మలు దూసుకుపోయేలా నావైపు చూచింది.

దాన్ని నా భాషలోకి మార్చుకుంటే -

"ఏమిటీ వృథా కాలక్షేపం... నీకు పిచ్చా?" అని తర్జుమా అయి నవ్వాను.

ఆమె అది చదివినట్టు కిలకిల నవ్వింది.

వర్షంలో తూర్పుగాలికి జవజవలాడిన పారిజాతం పువ్వులు కురిసినట్టు గది అంతా నవ్వులతో పరిమళించింది.

నా శరీరంలో ప్రతి రక్తకణం ఒక కాంక్షాగ్నితో మేలుకున్నట్టయింది.

అప్పుడు తీసిన మధువులా ఆమె నాలో మహోద్రేకాన్ని రగిల్చింది.

ఆమెను ఒత్తుకునేటంత దగ్గరగా జరిగి బుజంమీద చెయ్యివేసి మృదువుగా జడలోని జాజిపూలను మూర్కొన్నాను.

ఆమె బరువుగా ముందుకు ఒరిగింది. చక్కెర బొమ్మ ఒకటి ఆకొన్నవాడి ఎదుట అవతరించినట్టు.

పెల్లాకొన్నతనాన, తియ్యని పెదవులను, కళ్ళను, ముఖాన్ని యంత్రంలా ఆహారించడం ప్రారంభించాను.

ఎక్కడో ఒక సుఖప్రళయం, పరిమళ విప్లవం, తీవ్రంగా పట్టినట్టు చూచాయగా

వ్యక్తావ్యక్త చైతన్యానికి తెలియవచ్చింది.

• • •

ఉషస్సు నలిగిన తన జరీచీర చెరగులను సవరించుకొని చరచర ఆకాశశయ్య విడిచి వెళ్ళిపోయింది గాబోలు - సూర్యకిరణాలు ఎర్రగా వెచ్చగా గదిలోకి వచ్చాయి.

పరుపుమీద కళ్లు తెరిచాను.

మెత్తని ఆ సుఖశయ్య విడవాలని లేదు.

ఇంకా జాజిపూల వాసనతో పట్టుదిండ్లు పరిమళిస్తూన్నట్టే వుంది.

చట్టున జ్ఞాపకం వచ్చింది. బల్లవైపు చూశాను.

ఆ అతిలోక శిల్పసుందరి అట్లాగే అదే అభినయముద్రతో అరమోడ్పు కన్నుగవతో నిలిచి వుంది.

సృష్టిలో ప్రతి అణువూ ఆనందకరంగా, సౌందర్యభరితంగా కనిస్తున్నది.

ఆకాశం స్వచ్ఛంగా తెల్లని మేఘాలతో క్షీరసముద్రంలా వుంది.

నేను లేచి నించున్నాను.

దయాళువులైన ఏ దేవతలో మనస్సులో కొన్ని ఏండ్లకు సరిపోయేటంత మధువు నింపి ఒదిలిపెట్టినంత ఉత్సాహంగా ఉంది.

చరచర పరుగెత్తుతూ వెళ్ళి మిత్రులనందరినీ వరుసగా కౌగిలించుకొందామనిపించింది.

నా వాక్కులో రసమయ మహాకావ్యం ఒకటి ఉప్పతిల్లడానికి సిద్ధంగా వున్నట్టు తోచింది.

శిసముద్ర జలపాతంలా మేడ మెట్లమీద పరిగెత్తాను.

• • •

వెంకటేశ్వర్లు నిత్య మల్లెపూవులా శుభ్రంగా స్నానంచేసి మడత బట్టలు కట్టుకున్ని ప్రసన్నవదనంతో కూర్చున్నాడు.

వెంకటేశ్వర్లును గట్టిగా కౌగిలించుకుని 'వెళ్లివస్తా'నన్నాను.

అతడు చిరునవ్వుతో సౌఖశాయనికుడై -

"అప్పుడే వెళ్ళడమేనా?" అన్నాడు.

"పని వుంది" నవ్వుతో కలిపాను.

"ఈ తిక్తమధురక దుష్టపానీయం పుచ్చుకు మరీని" స్నేహం తొణికేలా అన్నాడు.

విచ్చిన రెల్లుపక్క కార్తీకమాసపు గోదావరీ శాంతనిశ్చల హృదయంలా వుంది అతని ముఖం.

"తమ్ముడూ, నువ్వు దేవుడివయ్యా" - వణికే గొంతుకతో అన్నాను.

పకపక నవ్వి "దేవుడెవడు?" అన్నాడు వెంకటేశ్వర్లు.

"నువ్వు"

నెమ్మదిగా రోడ్డుమీదకు వచ్చాను.

మళ్లా ఎప్పుడూ వెంకటేశ్వర్లు నాకు కనబడలేదు.

**(1947 డిసెంబరు - భారతి)**